క్లుప్తంగా

న్యూరోసర్జన్ సురేశ్‌కు పురస్కారం



అవార్డు అందుకుంటున్న గట్టినేని సురేశ్

ఖమ్మంవైద్యవిభాగం: ప్రముఖ న్యూరోసర్జన్ గట్టినేని సురేశ్‌కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 2024 ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ మాధాపూర్‌లో జరిగిన యాక్ట్ నౌ ఆర్గనైజేషన్ సంస్థ ప్రతి సంవత్సరం వైద్యవృత్తిలో అత్యున్నత సేవలు అందిస్తున్న డాక్టర్లకు ఈ అవార్డులు అందిస్తుండగా.. సురేశ్‌కు ఈ అవార్డు దక్కింది. సంస్థ ఫౌండర్, ప్రెసిడెంట్ డాక్టర్ కేఎస్ మూర్తి అవార్డు ప్రదానం చేశారు. కాగా, సురేశ్ నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో ఏడేళ్లుగా పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందిస్తూ ప్రాణాపాయంలో ఉన్న వారికి సైతం ఆపరేషన్లు చేస్తున్నట్లు ఆస్పత్రి యజమాన్యం తెలిపింది.

ఖమ్మం కవులకు సన్మానం



సన్మానం పొందిన ఖమ్మం కవులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం కవులను సూర్యాపేట జిల్లా నడిగూడెం, కోదాడ రచయితల సంఘం, సాహితీ కళా పీఠం సంయుక్తంగా సన్మానించాయి. కోదాడ నుంచి నడిగూడెం వరకు కవియాత్ర నిర్వహించి నడిగూడెంలో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో ఖమ్మం జిల్లాకు చెందిన సాధనాల వెంకటస్వామినాయుడు, కట్టికోల చిననర్సయ్య, హవాలత్ శీతలానాయక్, మందుల వీరభద్రం, సబ్బునాగయ్య, రేళ్ల శ్రీనివాస్, గరిడేపల్లి శోభనాద్రి, చిలరబత్తిన వీరబాబును సత్కరించారు.

రూ.5 వేలు వసూలు?

కామేపల్లి: గిరిజనుల అభివృద్ధికి బాటలు వేసేందుకు ఐటీడీఏ నుంచి ట్రైకార్ రుణాలను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టి లబ్ధిదారులను గుర్తించి వారికి రుణాలను అందించారు. కాగా, లబ్ధిదారుల నుంచి మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ రాజు ఖర్చుల కింద ఒక్కొక్కరి నుంచి రూ.5 వేలు చొప్పున వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. మండలంలో 2020–21లో ట్రైకార్ రుణాల కోసం ఎస్టీ కేటగిరికి చెందిన 45 మంది అర్హులను గుర్తించారు. ఈ క్రమంలో జూనియర్ అసిస్టెంట్ తన చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

రామ భక్తుల త్రిశూల్ దీక్ష

ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం త్రిశూల్ దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రిముడుపు యాదిరెడ్డి మాట్లాడుతూ.. అయోధ్య రామాలయ నిర్మాణ ఘటనలను వివరించారు. బోనాల రామకృష్ణ, కార్యదర్శి బొడ్డు కృష్ణ, నేరేళ్ల శ్రీనివాస్, బాలాజీ, శివరాములు, కన్నెబోయిన వెంకట్, రాము, రావినూతల శశిధర్, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

అవకాశం కల్పించాలి

ఖమ్మంమామిళ్లగూడెం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సారథ్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో 2004 నుంచి 2016 వరకు పనిచేసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అవకాశం కల్పించాలని గృహ నిర్మాణ సంస్థ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్, లక్ష్మణ్ ఆదివారం కోరారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

నేలకొండపల్లి: మండల కేంద్రంలో సత్యసాయి బాబా మందిరంలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వాసవీమాతా ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించారు. భారీగా హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గుమ్మడివెల్లి శ్రీనివాస్, రేగూరి హనుమంతరావు, రేగూరి వాసవి, దోసపాటి కల్పన, కృష్ణారావు, కొత్తా కరుణ, దోసపాటి చంద్రశేఖర్, మాటూరి శేషగిరిరావు, గెల్లా మధు, కొత్తా రాణి పాల్గొన్నారు.

ఖమ్మంలో..

ఖమ్మంగాంధీచౌక్: వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఖమ్మం నగరంలోని ఆయా దేవాలయాల్లో ఆదివారం నిర్వహించారు. గుట్టలబజార్‌లోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో చైర్మన్ మేళ్లచెరువు వెంకటేశ్వరరావు దంపతులు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చెరుకూరి కృష్ణమూర్తి, చిన్ని కృష్ణారావు, దేవకీ వాసుదేవరావు పాల్గొన్నారు. ట్రంక్‌రోడ్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆయలంలో యర్రం బాలగంగాధర్‌తిలక్ పాల్గొన్నారు.

వర్క్ ఇన్‌స్పెక్టర్ల ఇష్టారాజ్యం

- కేఎంసీలోని కీలక విభాగంలోనూ వారిదే పెత్తనం
- ఓ పక్క సిబ్బంది కొరత.. మరో పక్క వర్క్ ఇన్‌స్పెక్టర్లకు అసిస్టెంట్లు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో కీలక విభాగమైన ఇంజనీరింగ్ సెక్షన్‌లో వర్క్ ఇన్‌స్పెక్టర్ల పెత్తనం పెరిగిపోయిందన్న విమర్శలు ఉన్నాయి. అటు క్షేత్ర స్థాయిలో.. ఇటు కార్యాలయంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు రాజ్యమేలుతున్నారు. ఒకరిద్దరు అధికారుల అండతో కొంత మంది వర్క్‌ఇన్‌స్పెక్టర్లు ఇంజనీరింగ్ విభాగంలోని కీలకమైన డ్రాయింగ్ బ్రాంచ్‌లో ఏళ్లతరబడి పాతుకపోయి చక్రం తిప్పుతున్నారు. టెండర్ల ప్రక్రియ నుంచి పనులు పూర్తయిన తర్వాత బిల్లుల పాస్ ఆర్డర్ ఇచ్చే వరకు ఈ విభాగంలోని అధికారులదే పూర్తి బాధ్యత. అయితే, ఈ విభాగంలో పాతుకుపోయిన కొంతమంది సిబ్బంది అంతా తామై పనిచేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే వారు సైతం అధికారులకు మడుగులొత్తుతూ పెత్తనం చెలాయిస్తున్నారు. అసిస్టెంట్ ఇంజనీర్‌ల కింద పని చేసే వర్క్ ఇన్‌స్పెక్టర్లు తామే అధికారులమన్న చందంగా వారి కింద సహాయకులుగా కొంత మంది సిబ్బందిని నియమించుకున్నారు. అసలే కేఎంసీలో సిబ్బంది కొరత ఉండగా.. మరో కీలక విభాగం అయిన మంచినీటి సరఫరాకు చెందిన పంపు ఆపరేటర్లను వర్క్‌ఇన్‌స్పెక్టర్లు తమ కింద పెట్టుకొని పనులు చేయిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

విద్యార్హత లేకున్నా..

ప్రస్తుతం ఇంజనీరింగ్ విభాగంలో ఉన్న వర్క్ ఇన్‌స్పెక్టర్లలో ఎక్కువ శాతం ఐటీఐ సర్టిఫికెట్లు కలిగిన వారే ఉన్నారు. డిప్లొమా, ఇంజనీరింగ్ చదివిన వారితో ఈ హోదాలో పని చేయించాల్సి ఉన్నా అధికారులు రాజకీయ పలుకుబడి ఉన్న వారిని ఔట్‌సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకున్నారు. వీరికి కనీస విద్యార్హత కూడా లేదనే విమర్శలు ఉన్నాయి. కొంత మంది ఏకంగా దొంగ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగం పొందారన్న ఆరోపణలు ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో సిమెంట్‌తో చేసే పనులను పరిశీలించాల్సిన వీరికి సరైన అవగాహన లేకపోవడంతో నాణ్యత లేకుండా రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నా పనులను అడ్డుకోలేని పరిస్థితి ఉంది. దీంతో అనేక రోడ్లు నాణ్యత లేకుండానే నిర్మించినట్లు తెలుస్తోంది. అధికారులు ఇటీవల నిర్వహించిన క్వాలిటీ కంట్రోల్ పరీక్షలో అనేక రోడ్లు నాణ్యత లోపించినట్లు తెలుస్తోంది. దీనిపై కమిషనర్ సైతం వర్క్ ఇన్‌స్పెక్టర్లపై, ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపుల్లో సుమారు రూ.30 లక్షల వరకు కోత విధించినట్లు సమాచారం. ఇక ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఏకంగా రెగ్యులర్ సిబ్బంది, అధికారులపై కూడా పెత్తనం చెలాయిస్తున్నారన్న చర్చ కేఎంసీలో జరుగుతోంది.

అసిస్టెంట్ల నియామకం!

ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ఇంజనీర్‌ల కింద అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో అక్కడే ఉంటూ పనులను పర్యవేక్షించేందుకు వర్క్ ఇన్‌స్పెక్టర్లను నియమించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు క్షేత్ర స్థాయిలో ఉండి పనులను పర్యవేక్షిస్తూ, నాణ్యతను పరిశీలించాల్సి ఉంది. ఇటీవలి కాలంలో అధికారుల అండతో వారి కింద కూడా అసిస్టెంట్లను నియమించుకుంటున్నట్లు తెలుస్తోంది. కేఎంసీలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిగా ఉన్న తమ బంధువులను, దగ్గరవారిని తీసుకొచ్చి తమ కింద అసిస్టెంట్లుగా నియమించుకున్నారు. పంపు ఆపరేటర్లను, ఇన్‌వార్డ్‌లో పని చేసే వారిని తీసుకెళ్లి వారి కింద నియమించుకొని ఖాళీగా తిప్పుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. అసలే నగరంలో పైపుల లీకేజీలు, మంచినీటి సరఫరాలో సమస్యలు అధికంగా ఉంటే అక్కడ పని చేసే వారిని అసిస్టెంట్లుగా నియమించుకోవడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

డీబీలో కదలని సిబ్బంది..

ఇంజనీరింగ్ విభాగంలో అనేక ఆరోపణలు రావడంతో డీఈఈలను బదిలీ చేయడంతో పాటు వారు పర్యవేక్షించాల్సిన డివిజన్లను ఉన్నతాధికారులు మార్చారు. అసిస్టెంట్ ఇంజనీర్లను, క్షేత్ర స్థాయిలో వర్క్ ఇన్‌స్పెక్టర్లకు సైతం డివిజన్లను మార్చి కేటాయించారు. అయితే కార్యాలయంలో కీలకంగా పని చేసే డ్రాయింగ్ బ్రాంచ్‌లో మాత్రం సిబ్బందిని అధికారులు కదిలించలేదు. ఒకరిద్దరు అధికారుల అండతో డీబీలోని ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఏళ్ల తరబడి అక్కడే పని చేస్తూ ఇటీవల జరిగిన మార్పుల్లో తమ పేర్లు లేకుండా చూసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇక వీరు రెగ్యులర్ ఉద్యోగులను సైతం మాటలతో ఇబ్బందులు పెడుతుండగా.. ఉన్నతాధికారులు సైతం వారికే వంత పాడుతున్నారన్న చర్చ కొనసాగుతోంది. ఏళ్ల తరబడి రెగ్యులర్ ఉద్యోగులను కాదని వీరినే డీబీలో కొనసాగించడంపై కూడా పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

అన్ని విషయాలను పరిశీలిస్తాం..



కొత్త డీఈఈ బాధ్యతలు తీసుకున్న తర్వాత అందరికీ డివిజన్లు మార్చి కేటాయించాం. వర్క్ ఇన్‌స్పెక్టర్ల కింద అసిస్టెంట్లు ఉన్న విషయాన్ని పరిశీలిస్తాం. డీబీలో సిబ్బందిపై వస్తున్న ఆరోపణలను సైతం పరిశీలిస్తాం. అధికారులను సమర్థంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటాం.

–ఆదర్శ్ సురభి, కమిషనర్, కేఎంసీ

జిల్లా బంద్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న గోకినేపల్లి వెంకటేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణబంద్‌తో పాటు జిల్లాబంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లు పూర్తయినా కూడా రైతాంగం, కార్మికుల సమస్యలను ఇంకా పరిష్కరించలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరులను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అప్పగిస్తూ దేశ ప్రజలను మోసం చేస్తోందని తెలిపారు. సమావేశంలో నాయకులు ఆవుల అశోక్, ఝాన్సీ, కొల్లేటి నాగేశ్వరరావు, లక్ష్మణ్, కె.శ్రీను, శిరోమణి, శోభ, రామనాథం, చందు తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల విషయంలో ఆందోళన వద్దు..

నేలకొండపల్లి: ప్రస్తుతం వచ్చేవన్నీ వైరల్ జ్వరాలేనని, ఆందోళన చెందనవసరం లేదని ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ రామునాయక్ తెలిపారు. మండలంలోని పైనంపల్లి, రాయగూడెం గ్రామాల్లో వైద్య శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జ్వరాలు వచ్చిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి జి.లక్ష్మీనారాయణ, నేలకొండపల్లి వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు దారా ప్రసాద్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల రక్షణ కోసం ఉద్యమించాలి

నేలకొండపల్లి: శ్రామిక వర్గం హక్కుల రక్షణ కోసం ఉద్యమించాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి జి.రామయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం గోసు పుల్లయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పగిస్తున్నారని మండిపడ్డారు. కార్మికులు సాధించుకున్న చట్టాలను 4 కోడ్‌లుగా మార్చి సమ్మె చేసే హక్కులను కాలరాసి 8 గంటల పని విధానాలను మారుస్తూ 12 గంటల పని విధానం అమలకు పూనుకున్నారన్నారు. ఈ నెల 16న చేపట్టిన దేశవ్యాప్తసమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాలేరు డివిజన్ కార్యదర్శి పగిడికత్తుల రామదాసు, మీగడ సైదులు, మాధవరావు, కందుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం ఎస్ఐగా గిరిధర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం ఎస్ఐగా గిరిధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఎస్ఐగా పనిచేసిన వరాల శ్రీనివాస్‌ను ఖమ్మం వీఆర్‌కు బదిలీ చేశారు.

శుభాకాంక్షలు

కూసుమంచి: తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా ఖమ్మానికి చెందిన కార్పొరేటర్ కమర్తపు మురళి ఆదివారం హైదరాబాద్‌లోని పద్మశాలిభవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను కూసుమంచి మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు లగ్గిశెట్టి వీరబాబు, పాలేరు నియోజకవర్గ కార్యదర్శి తుమ్మ ఉపేందర్, నేలకొండపల్లి మండల అధ్యక్షులు గిరి, కార్యదర్శి సామాల కోటేశ్వరరావు తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సంపూర్ణ జీవన విధానం ఇస్లాంతోనే..



మాట్లాడుతున్న సాధిక్ అహ్మద్

ఖమ్మంమామిళ్లగూడెం: ఇస్లాంతోనే సంపూర్ణ జీవన విధానం అలవడుతుందని జమాతె ఇస్లామి హింద్ రాష్ట్ర సలహా మండలి సభ్యులు సాధిక్‌అహ్మద్ అన్నారు. ఖమ్మం అజీజ్‌గల్లీలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు జైనుల్ పాషా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇస్లాం మార్గంలో పయనిస్తే ఇహలోక సాఫల్యం కలుగుతుందన్నారు. మనిషి ఎల్లప్పుడూ దైవ విధేయత కలిగి సమస్త చెడులకు దూరంగా ఉండి పవిత్ర జీవితం గడపాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు సమీ, ఖిల్లా డివిజన్ అధ్యక్షుడు మలిక్, అబ్రార్ అలీ, రఫీ, మాజీ అధ్యక్షుడు ఖలీల్ అహ్మద్‌ఖాన్, అబ్దుల్ సుబూర్, ఇలియాస్, లతీఫ్, మూసా, రజాక్, గౌస్, ఫయాజ్, హసన్, మదార్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు నేర్చుకునేది స్కూల్లోనే..



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: విద్యార్థులు నైతిక విలువలు నేర్చుకునేది పాఠశాల స్థాయిలోనేనని ప్రముఖ వైద్యులు పరుచూరి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం రాత్రి నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు ఇతర రంగాల్లో సైతం యాక్టివ్‌గా ఉండాలన్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్లు రాజావాసిరెడ్డి నాగేంద్రకుమార్, నీలిమ మాట్లాడుతూ.. పరిమితి విద్యార్థులతో ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సెలవు ప్రకటించడంపై హర్షం



సేవాలాల్, రేవంత్‌రెడ్డి చిత్రపటం వద్ద నమస్కరిస్తున్న బంజారా సేవా సంఘం నాయకులు

రఘునాథపాలెం: బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15 నాడు సెలవు ప్రకటించినందుకు ఆదివారం రఘునాథపాలెంలోని సంత్ సేవాలాల్ ఆలయ ప్రాంగణంలో ఆల్‌ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ధరావత్ రామ్మూర్తినాయక్, తారాబాయి, వీరునాయక్, లాల్ సింగ్‌నాయక్, నంద్యానాయక్ పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన డాక్టర్స్ క్రికెట్ టోర్నీ



టోర్నీలో పాల్గొన్న వైద్యులు

ఖమ్మంస్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సైజర్ ఫార్మా స్యూటికల్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ ఆదివారం ప్రారంభమైంది. జిల్లా ఐఎంఏ అధ్యక్షుడు నారాయణ, డాక్టర్ కూరపాటి ప్రదీప్ ప్రారంభించగా.. పోటీల్లో నల్లగొండ, వరంగల్ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. మ్యాచ్‌లు అర్ధరాత్రి వరకు కొనసాగుతాయని నిర్వాహకులకు తెలిపారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల డాక్టర్లు, సైజర్ కంపెనీ ప్రతినిధులు, ఓలేటి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

‘టాటా ఐ’ రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న సంస్థ ఉద్యోగులు

ఖమ్మంవైద్యవిభాగం: టాటా ఐ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వైరారోడ్‌లోని డాక్టర్స్ వాలంటరీ బ్లడ్ బ్యాంక్‌లో ఆదివారం నిర్వహించిన శిబిరంలో 30 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా సంస్థ బ్రాంచ్ మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ.. సంస్థ 23వ వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంస్థకు చెందిన 30 మంది సిబ్బంది రక్తదానం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రమేశ్, ముకుంద్, రమగోపి, బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు నున్నా శ్రీకాంత్ పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాలకు మేలు చేకూర్చే బడ్జెట్



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: అట్టడుగు వర్గాలకు మేలు చేకూర్చేలా బడ్జెట్ ఉందని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావీద్, పుచ్చకాయల వీరభద్రం అన్నారు. శనివారం అసెంబ్లీలో ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అన్ని వర్గాలకు ఉపయోగపడేలా ఉందన్నారు. ఆదివారం నగరంలోని కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డిభవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు ఉతమిచ్చేలా ఉంటే.. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వ బడ్జెట్ మాత్రం అందుకు భిన్నంగా ఉందన్నారు. కార్యక్రమంలో రబ్బానీ, ఏలూరి రవికుమార్, అబ్బాస్ బేగ్, ముజాహిద్దిన్, అహ్మద్, రియాజ్, అమరనేని బాబూరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కిట్లు పంపిణీ



అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్: జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగే జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహమూర్తి, అష్రఫ్, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ వెంకటేశ్వర్లు, ఎండీ షఫీ, ఎం.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గానికి సన్మానం



సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్ల గ్రామ పంచాయతీలో ఆదివారం తాజా మాజీ సర్పంచ్, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం ముగిసినందున గ్రామ సర్పంచ్ శ్యామ్, ఉపసర్పంచ్ స్వాతి, వార్డు సభ్యులు భవాని, వాణి, శంకర్‌ను పంచాయతీ సెక్రెటరీ సుజాత అధ్యక్షతన గ్రామస్తులు కుర్ర భాస్కరరావు, ఉప్పెర్ల కొండల్‌రావు, అనుబొతు రామస్వామి, ఎస్ఎంసీ చైర్మన్ కూరకుల నాగేశ్వరరావు, చల్లగుండ్ల శ్రీనివాసరావు, అంగొతు రాందాస్, పొట్లపల్లి కోటేశ్వరరావు, గుంగంటి రామారావు, వల్లభనేని విజయ్, జంగిలి మహేశ్, అర్వికట్ల రవి, రామనాథం పాల్గొన్నారు.

ఆర్టీసీ ఈయూ రీజియన్ కమిటీ ఎన్నిక



ఆర్టీసీ ఈయూ రీజియన్ కమిటీ సభ్యులు

ఖమ్మంమామిళ్లగూడెం: ఆర్టీసీ ఈయూ ఖమ్మం రీజియన్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మణుగూరు డిపోకు చెందిన జి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఖమ్మం డిపోకు చెందిన పిల్లి రమేశ్, కోశాధికారిగా హరనాథ్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.కృష్ణతో పాటు మరో 19 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, రమేశ్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నూతన కమిటీని జిల్లా గౌరవ అధ్యక్షుడు బీజీ క్లైమెంట్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు అభినందించారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న గ్రామీణ వైద్యులు

ఖమ్మంమామిళ్లగూడెం: గ్రామీణ వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించి వారి మన్ననలను పొందాలని తెలంగాణ అనుభవ వైద్యుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ అన్నారు. గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం 21వ మహాసభ జిల్లా అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం కృష్ణా ఫంక్షన్‌హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా 2024 నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సమాఖ్య ఉపాధ్యక్షుడు తన్నీరు సత్యనారాయణ, నాయకులు నగేశ్, శంకర్, రవీందర్, వెంకటాచారి, నగర ప్రముఖ వైద్యులు వై.ప్రసాద్, సింధూజ, పరుచూరి వెంకటేశ్వరరావు, శ్రీరామ్, నాయకులు సుదర్శన్, మణికుమార్, వెంకటరామయ్య, రాము, డి.శ్రీనివాసరావు, ఆర్.శ్రీనివాసరావు, మహమూద్, హుస్సేన్‌మియా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా గురుకుల ప్రవేశ పరీక్ష

నేలకొండపల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష సజావుగా సాగింది. నేలకొండపల్లి గురుకుల పాఠశాల కేంద్రానికి మొత్తం 384 మంది విద్యార్థులను కేటాయించారు. పరీక్షకు 362 మంది హాజరయ్యారు. ఏడుగురు గైర్హాజరయ్యారు. పరీక్షలకు నల్లగొండ గురుకుల సంస్థ ఆర్‌సీఓ కె.లక్ష్మయ్య పరిశీలకులుగా ఉన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా సుజాత, సిట్టింగ్ స్క్వాడ్ రాధిక, నేలకొండపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఈ.ప్రమీల పనిచేశారు. పరీక్షలు విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. విద్యార్థుల కోసం వచ్చిన తల్లిదండ్రులతో గురుకుల పాఠశాల ఆవరణ సందడిగా మారింది. కానీ, వారికి తగిన సౌకర్యాలు లేక ఇబ్బంది పడ్డారు.